ప్రజాశక్తి
శనివారం 4 మార్చి 2023
5
శ్రీకాకుళం



ఆఫ్‌షోర్ మొదలు!

- రూ.288 కోట్లతో పనులు ప్రారంభం
- కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగింత
- వచ్చే ఏడాది అక్టోబరు నాటికి పూర్తయ్యేలా ఒప్పందం

ఎట్టకేలకు ఆఫ్‌షోర్ పనులు మొదలయ్యాయి. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను నిలిపేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో రిజర్వాయర్ పనుల్లో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. రిజర్వాయర్ పనులను చేపట్టేందుకు అధికారులు పలుమార్లు సవరించిన అంచనా వ్యయంతో ప్రభుత్వానికి నివేదించారు. చివరకు ప్రభుత్వం గతేడాది డిసెంబరులో రూ.855 కోట్లతో పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని తిరిగి న్యాయసమీక్షకు పంపిన తర్వాత రూ.852 కోట్లతో పనులు చేపట్టేందుకు క్లియరెన్స్ వచ్చింది. పనులకు సాంకేతిక అనుమతులు, టెండర్లు పిలవడం, కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగించడం చకచకా జరిగిపోయాయి. దీంతో కొత్త నిర్మాణ సంస్థ పనులు మొదలు పెట్టింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



పనుల ఒప్పందాన్ని రద్దు చేసిన ప్రభుత్వం, మిగిలిన పనుల కోసం సవరించిన అంచనాలతో పంపిన ప్రతిపాదనలనూ ఆమోదించలేదు. పైగా పనులను ఉన్నపళంగా ఆపేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మూడేళ్లుగా ఆగిన ఆఫ్‌షోర్‌ను పూర్తి చేసి నీళ్ల ఇస్తామంటూ ఏళ్ల తరబడి రైతులను ఊరించడమే తప్ప వాటిని పూర్తి చేయడంలో పాలకులు చిత్తశుద్ధి కనబరచడం లేదు. 2007లో వైఎస్ హయాంలో ప్రారంభమైన పనులు నేటికీ ఒక కొలిక్కి రాలేదు. టిడిపి ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలోనూ పనులను పూర్తి చేయలేకపోయింది. 2014-19 మధ్య కాలంలో 38 శాతం మాత్రమే పనులు జరిగాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన మూడేళ్ల కాలంలో ఒక్క శాతం పనీ కాలేదు. దీంతో రిజర్వాయర్ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ఇప్పటివరకు 38 శాతం జరిగాయి. మిగిలిన పనుల పూర్తికి రిజర్వాయర్ పనులు, భూసేకరణ తదితర చెల్లింపులకు రూ.852 కోట్లకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందులో పనుల కోసం రూ.288 కోట్లను కేటాయించింది. పనులు చేపట్టేందుకు పిలిచిన టెండర్లలో హైదరాబాద్‌కు చెందిన సాయిలక్ష్మి కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఖరారైంది. ఈ నిర్మాణ సంస్థ జిల్లాలో వంశధార ప్రాజెక్టు స్టేజ్-2, ఫేజ్-2లో 88 ప్యాకేజీ పనులను చేస్తోంది. వచ్చే ఏడాది అక్టోబరు లోగా పనులు పూర్తి చేయాలన్నది ఒప్పందంలో భాగంగా ఉంది.

రిజర్వాయర్ పూర్తయితే 24,600 ఎకరాలకు సాగునీరు

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్.వి.ఇ.సి-ఇందు సంస్థతో రూ.123.25 కోట్లతో ఫిబ్రవరి 18, 2007లో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం 2008 జనవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. భూసేకరణ పనులు సకాలంలో కాకపోవడం, ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించకపోవడంతో 2014 వరకు పనులు ప్రారంభం కాలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం, రిజర్వాయర్ పనులను మళ్లీ అదే సంస్థకు అప్పగించింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరించి రూ.466.28 కోట్లకు పెంచింది. ప్రాజెక్టు పనుల పూర్తికి జులై 7, 2019 వరకు గడువు ఇచ్చింది. టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిన నాటికి 38 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మిగిలిన పనులకు సంబంధించి కొత్త రేట్లతో రూ.855 కోట్ల అంచనా వ్యయంతో 2021 సెప్టెంబరులోనే అధికారులు ప్రతిపాదనలు పంపారు.

నిర్మాణ పనులు జరిగింది 38శాతమే

రిజర్వాయర్ పనులు ప్రస్తుతం 38 శాతం మేర జరిగాయి. మట్టి పనులు 83,31,000 క్యూబిక్ మీటర్ల పని చేపట్టాల్సి ఉండగా 42,36,527 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. ఇంకా 40,94,473 క్యూబిక్ మీటర్ల పని మిగిలి ఉంది. కాంక్రీట్ పనులు 1,31,544 క్యూబిక్ మీటర్ల పని జరగాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,457 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. మరో 1,29,087 క్యూబిక్ మీటర్ల పని పెండింగ్‌లో ఉంది. మరోవైపు భూసేకరణ కూడా పెండింగ్‌లో ఉంది. రిజర్వాయర్ కోసం 2,435.72 ఎకరాలు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,061 ఎకరాలను సేకరించారు. ఇంకా 374 ఎకరాలను సేకరించాల్సి ఉంది.

పనులు ఊపందుకునేనా?

రిజర్వాయర్ పనులు ఇప్పటివరకు 38 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఖర్చుల విషయంలో మాత్రం గత టిడిపి ప్రభుత్వం ఎక్కడా తగ్గలేదు. రిజర్వాయర్ నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.123.25 కోట్ల నుంచి రూ.466.28 కోట్లకు పెంచిన విషయం తెలిసిందే. అందులో రూ.314.16 కోట్లను వెచ్చించింది. అంటే 71.73 శాతం మేర ఖర్చు చేసింది. మిగిలి పనులను కొత్త నిర్మాణ సంస్థ త్వరితగతిన పూర్తి చేస్తే రైతుల కల నెరవేరనుంది.

వచ్చే ఏడాది అక్టోబరుకు పూర్తి



ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. కొత్త టెండర్లను దక్కించుకున్న సంస్థ పనులు మొదలుపెట్టింది. వచ్చే ఏడాది అక్టోబరు నాటికి పనులు పూర్తి చేసి సాగునీరు అందిస్తాం.

- డోల తిరుమలరావు, జలవనరులశాఖ ఎస్ఇ

ధాన్యం కొనకపోతే...

ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్తాం

- రైతుల జీవితాలతో ఆడుకోవద్దు
- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - బూర్జ

నేటికీ రైతుల కళ్లాలు, పొలాల్లోనే ధాన్యం ఉన్నాయని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఎందుకు కొనుగోలు చేయడం లేదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోతే, ప్రభుత్వ కార్యాలయంలో పోస్తామని హెచ్చరించారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయకపోవడంపై మండల కేంద్రంలో వ్యవసాయశాఖ అధికారి వి.రాజేశ్వరరావును శుక్రవారం ప్రశ్నించారు. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయకుండా వారి జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పిన పాలకులు ఇప్పుడేం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పంట పండించేందుకు కష్టపడిన రైతులు వాటిని అమ్ముకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మండలంలో నేటికీ 60 శాతం కూడా ధాన్యం కొనుగోలు చేయలేదని చెప్పారు. రైతులపై ప్రభుత్వం, అధికారుల చిత్తశుద్ధి ఎంత ఉందో తేటతెల్లమైందన్నారు. ఇప్పటికైనా రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు టిడిపి మండల అధ్యక్షులు వావిలపల్లి సీతారాంబాబు నాయుడు, సర్పంచ్ సీతారామరాజు, తెలుగు యువత మండల అధ్యక్షులు జగన్నాథ నాయుడు, వెంకటప్పలనాయుడు తదితరులున్నారు.



మండల వ్యవసాయ అధికారిని ప్రశ్నిస్తున్న రవికుమార్

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఎం నగర కమిటీ కన్వీనర్ టి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలకు బతకలేని స్థితి కల్పిస్తోందన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక అనేకసార్లు వంటగ్యాస్ ధరలతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని చెప్పారు. మరోవైపు వంటగ్యాస్‌పై పేదలకు ఇచ్చే రాయితీలను రద్దు చేశారని విమర్శించారు. ఇప్పటికే ఉజ్వల పథకాన్ని నీరుగార్చిందన్నారు. రెండేళ్లుగా గ్యాస్ సబ్సిడీ ఎవరికీ ఒక్క పైసా కూడా జమ కాలేదన్నారు.

రూ.వేల కోట్ల లాభాలు కార్పొరేట్లకు రాయితీలుగా ఇస్తున్న మోడీ, సామాన్య ప్రజలపై భారాలు వేయడం సరికాదన్నారు. ఒకవైపు ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ మరోవైపు పెద్దలకు రూ.వేల కోట్ల ఆస్తులు దోచిపెడుతున్నాయని విమర్శించారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో పార్టీ నాయకులు శ్రీదేవి పాణిగ్రాహి, లబ్బ రాజు, వెంకట్రావు పాణిగ్రాహి, ఎం.ఎర్రయ్య, పాపారావు, కన్నయ్య, లక్ష్మీకుమారి, సూర్యనారాయణ, తాతారావు, రాజారావు, అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఎమ్మెల్సీ ఎన్నికలు రిఫరెండం

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ బూటకం
- వైసిపి పతనం ఆరంభం
- ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి

రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలకు రిఫరెండమని టిడిపి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. టెక్కలిలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పతనం ఆరంభమైందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. అధికారంలోకొస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్, కేసుల భయంతో కిమ్మనడం లేదని విమర్శించారు. విశాఖ రైల్వేజోన్ గానీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు గానీ, చివరకు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై గానీ చేష్టలుడిగి చూస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత అధికార పార్టీ ఎంపీలపై ఉన్నా, వారు ఆ బాధ్యతను నిర్వర్తించలేకపోతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం ముందు తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. రాష్ట్రం అప్పుల ఊబిగా మారిపోయిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ధరలు తగ్గుతున్నా, రాష్ట్రంలో మాత్రం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరల వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి గుదిబండగా మారిందన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ బూటకం

విశాఖలో నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ బూటకమన్నారు. ఎన్నికల ముందు ప్రజలను మళ్లీ నమ్మించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆడుతున్న డ్రామా అని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక విశాఖకు గానీ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి గానీ చేసిందేమీ లేదన్నారు. పెట్టుబడిదారుల సదస్సు రాజకీయ ఆర్భాటం కోసమేనని విమర్శించారు. ఎన్నికల ముందు రాజధాని అని ప్రచారం చేసుకుంటూ ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ సమ్మిట్ వల్ల రాష్ట్రానికి ఉపయోగమేమీ లేదన్నారు. సమావేశంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, టిడిపి నాయకులు మామిడి రాము, కోళ్ల కామేష్, రెయ్యి ప్రీతీష్‌చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మల్లిపెద్ది మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

శ్రీకాకుళం అర్బన్ : ఆడపిల్లల సంరక్షణతో పాటు వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడం ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. భేటీ బచావ్, భేటీ పడావ్ ర్యాలీని నగరంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బాలికల సంరక్షణ, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కేంద్రం ప్రభుత్వం 2015 జనవరి నుంచి సేవ్ ది గర్ల్ చైల్డ్ టు ఎడ్యుకేట్ గర్ల్ చైల్డ్ కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. భేటీ బచావో ప్రచారానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మద్దతు ఇస్తోందన్నారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వరకు సాగిన ర్యాలీలో జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి ఎన్.అనురాధ, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డిఐఒ ఆర్.వి.ఎస్ కుమార్, కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు సూర్యకళ, మోహిని, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై అసహనం

కొత్తూరు : ఈనెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అరకొర ఏర్పాట్లపై టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించిన ఆయన ఓటర్లు వెళ్లేందుకు ర్యాంపు ఏర్పాటు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో ర్యాంపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం నేరడి పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 321/1 లో 1.66 ఎకరాల చెరువు ఆక్రమణలకు గురైనట్లు లోకాయుక్తలో స్థానికుల ఫిర్యాదుపై ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి, స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ పి.బాలను ఆదేశించారు. కార్యక్రమంలో డిటి బి.వెంకటరమణ, సిఐ ఆర్.వేణుగోపాలరావు, ఎస్ఐ గోవింద్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- మహిళా భద్రతే ప్రథమ ప్రాధాన్యం
- సైబర్ నేరాలపై అప్రమత్తం
- నేర రహిత సమాజం లక్ష్యం కావాలి
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం



ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని, నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక హెచ్చరించారు. మహిళా పోలీసుల విధి విధానాలు, మహిళల భద్రత, నాటుసారా, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా భద్రతే మొదటి ప్రాధాన్యతగా భావించి విధులు నిర్వహించాలని మహిళా పోలీసులకు సూచించారు. ప్రేమ పేరిట వేధింపులకు గురిచేస్తున్న వారిని ముందస్తుగా గుర్తించి, మహిళలపై నేరాలను అరికట్టాలన్నారు. నేర రహిత సమాజం కోసం బాధ్యత, క్రమశిక్షణతో పనిచేసి విధులపై అంకితభావంతో మెలగాలన్నారు. జిల్లా పోలీస్ విభాగం అండగా ఉంటుందన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను మానవీయ కోణంలో అర్థం చేసుకుని పరిష్కరించాలని చెప్పారు. కళాశాలలు, పాఠశాలల పరిధిలో ప్రేమ పేరిట వేధింపులు చేస్తున్న ఆకతాయిలను గుర్తించి మహిళపై జరిగే నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అటువంటి సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ అధికారులకు తెలపాలన్నారు. గ్రామంలో సందర్శించి తరచూ గొడవలు పడిన వారిని గుర్తించి, ఘర్షణల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి కలసిమెలసి జీవించేలా చైతన్యం కల్పించాలని కోరారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకుని ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుని స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. దిశ యాప్‌ను గ్రామ, పట్టణాల్లో ఉన్న మహిళలకు తెలియజేసి క్షేత్రస్థాయిలో సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. గంజాయి, నాటుసారా నియంత్రణలో కీలకపాత్ర వహించి గ్రామాల్లో ప్రతిరోజూ సందర్శించి ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటేనే వారికి నమ్మకం ఏర్పడుతుందని, అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించి నేర నియంత్రణలో కీలకపాత్ర వహించాలని దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పి జి.శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు గరిష్ట కూలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఉపాధి హామీ కూలీలకు గరిష్ట కూలి రూ.257 రావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్పష్టం చేశారు. మండలంలోని చిట్టివలసలో అమృత్ సరోవర్ పథకం కింద జగ్గన్న కోనేరులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. కూలీలు కొంత కష్టపడితే గరిష్ట కూలిని పొందవచ్చని చెప్పారు. కూలీలకు చెల్లించే డబ్బులపై కాంపోనెంట్ నిధులు ఆధారపడి ఉంటాయన్నారు. 170 మంది కూలీలకు గానూ 70 మంది పనులకు రావడంపై కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. ఎక్కువ కూలి వస్తుండడంతో బయట పనులకు వెళ్తున్నారని చెప్పారు. జగ్గన్న కోనేరులో చెత్త ఉండడాన్ని గమనించిన కలెక్టర్, సచివాలయ పారిశుధ్య కార్యదర్శిని పిలిపించారు. ప్రభుత్వం ఒకవైపు చెరువులను బాగు చేస్తుంటే, చెరువులో చెత్త వేయడం ఏమిటని ప్రశ్నించారు. చెత్త పారబోసే వారికి రూ.పది వేల నుంచి రూ.20 వేల వరకు పెనాల్టీ విధించాలని ఆదేశించారు. దీని ద్వారా సచివాలయాలకు ఆదాయంతో పాటు ఇటువంటి చెత్త పనులు చేయాలంటే భయం కలుగుతుందన్నారు. మండలంలో అమృత్ సరోవర్ పథకం కింద ఎన్ని చెరువులు మంజూరయ్యాయని ఉపాధి హామీ అధికారులను ప్రశ్నించారు. నెల్లిపర్తి, రామచంద్రపురం, కట్యాచార్యులపేటలో మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. నెల్లిపర్తిలో పనులు పూర్తయ్యాయని మిగతా చెరువులు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఏప్రిల్ నాటికి అవి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కూలీలను పెంచాలని సూచించారు. 22 ఎల్ కాలువ నుంచి జగ్గన కోనేరు వరకు గతంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టామని, నేటికీ రూ.9.95 లక్షల బిల్లు మంజూరు కాలేదని సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, తహశీల్దార్ ఎస్.గణపతి, ఎంపిడిఒ ఎం.రేణుక, ఎపిఒ సురవరపు లక్ష్మీనరసమ్మ, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అర్ధాంతరంగా పాఠశాలను మూసేస్తే క్రిమినల్ చర్యలు

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

అర్ధాంతరంగా పాఠశాలలను మూసేస్తే క్రిమినల్ చర్యలు తప్పవని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు. మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలోని కొత్తరోడ్డు జంక్షన్‌లో ఉన్న వెలాసిటీ ఇంటర్నేషనల్ స్కూల్‌ను శుక్రవారం పరిశీలించారు. వందలాది మంది విద్యార్థులతో నడుస్తున్న పాఠశాలను అర్ధాంతరంగా మూసివేసే చర్యల్లో భాగంగా తరగతులు నిర్వహించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్న విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అందులో భాగంగానే కమిషన్ నిజానిజాలు తెలుసుకునేందుకు వచ్చామన్నారు. మండల విద్యాశాఖాధికారి దుప్పల రామారావు, కరస్పాండెంట్ బమ్మిడి రమేష్ నుంచి పాఠశాల గుర్తింపు పత్రాలు, ఎన్ని తరగతుల వరకు ఉన్నాయి, ఇప్పటివరకు ఎన్నిసార్లు విద్యాశాఖాధికారులు, వార్డు సచివాలయం మహిళా సంరక్షణ, సంక్షేమ కార్యదర్శులు సందర్శించారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కమిషన్ సభ్యులు సీతారాం మాట్లాడుతూ అర్ధాంతరంగా విద్యా సంవత్సరం పూర్తి కాకుండా పాఠశాల మూసివేసే చర్యలు గానీ యాజమాన్యం తీసుకుంటే పలు సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసేలా కలెక్టర్, ఎస్‌పికి ఆదేశాలు ఇస్తామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం పూర్తిగా ముగిసే వరకు ఉపాధ్యాయులను కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డిఇఒకు ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ఆయన వెంట జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి రమణ, తోటాడ సర్పంచ్ మెట్ట శారద, బాలల సంఘాల నాయకులు కె.శ్రీనివాస్, ఎం.వాసుదేవకుమార్, బి.రమేష్ సచివాలయాల కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి విద్య అవసరం

శ్రీకాకుళం అర్బన్ : ఉన్నత విద్యా విధానంలో వ్యక్తిత్వ వికాస నైపుణ్యాభివృద్ధి, నైతిక విలువలు, విశ్లేషణాత్మక ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పి.భాస్కర్ అన్నారు. నూతన విద్యా విధానం-2020పై ప్రభుత్వ మహిళా కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్‌లో చివరి రోజు శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల మేధస్సు వారి విద్యా ప్రమాణాలను విశ్లేషించే విధంగా పరీక్షల నిర్వహణ ఉండాలని సూచించారు. టీచింగ్, లెర్నింగ్ విధానంలో మరిన్ని మార్పులు రావాలన్నారు. విద్యా విధానంలో ఇంటర్న్‌షిప్ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. సెమినార్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ లజపతిరాయ్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు, కో-కన్వీనర్ మౌనిక, శివప్రసాద్, ప్రమీల, చక్రపతి, పైడితల్లి తదితరులు విభిన్న అంశాలపై తమ నివేదికలను అందించారు.

ఆదాయ వనరుల పెంపునకు విడివికెలు

ప్రజాశక్తి-మెళియాపుట్టి

ఆదాయ వనరుల పెంపునకు రూ.15 లక్షలతో రెండు వందన వికాస కేంద్రాలు(విడివికె) ఒక యూనిట్గా పలు మండలాల్లో ఏర్పాటు చేసినట్లు ఐటిడిఎ పిఒ నవ్య అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విడివికెను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం సభ్యులకు ప్రొసెసింగ్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. అనంతరం ఆమె చాపర సచివాలయాన్ని తనిఖీ చేశారు. హాజరుపట్టీలు పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దార్ సరోజని, ఎంపిడిఒ చంద్రకుమార్, నారాయణరావు, లలిత, తదితరులు ఉన్నారు.

టిడిపి కార్యాలయానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న గౌతు శిరీష

పలాస: శాసనం గ్రామ సమీపంలో టిడిపి కార్యాలయానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శాశ్వత కార్యాలయం ఉండాలనే ఉద్దేశంతో కార్యాలయంతో పాటు సొంత గృహం నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో యార్లగడ్డ వెంకన్న చౌదరి, వజ్జ బాబూరావు, పి.విఠల్రావు, బూరెల విజయ్ కృష్ణంరాజు, గురిటి సూర్యనారాయణ, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహానికి కుర్చీలు వితరణ

పలాస: పలాస రాజమ్మ కాలనీలోని బిసి పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహానికి పలాస లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.5,600ల విలువ చేసే కుర్చీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కణితి విశ్వనాథం, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.అప్పారావు, సెక్రటరీ తమ్మినేని మాధవరావు, డాక్టర్ ఆర్.ఆనందరావు, డాక్టర్ కృష్ణమూర్తి, కెపి రామన్న, హెచ్ఎ.డొర, కొర్రాయి బాలకృష్ణ, హాస్టల్ మేట్రిన్ కృష్ణవేణి పాల్గొన్నారు.

భూకంప బాధితులకు సాయం

శ్రీకాకుళం అర్బన్ : భూకంపంతో సర్వం కోల్పోయిన టర్కీ, సిరియా దేశాల ప్రజలకు తమ వంతు సాయం అందించేందుకు విద్యార్థులు ముందుకొచ్చారు. నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న న్యూసెంట్రల్ స్కూల్, జూనియర్ రెడ్క్రాస్ విభాగం విద్యార్థులు రూ.50వేలు పోగు చేసి చెక్కును శుక్రవారం డిఇఒ గార పగడాలమ్మకు అందజేశారు. స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రెడ్క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, రెడ్క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, శ్రీదేవి, రెడ్క్రాస్ కమిటీ సభ్యులు కనుగుల దుర్గా శ్రీనివాసరావు, ఎం.కళ్యాణ్ చక్రవర్తి, పి.వైకుంఠరావు, డి.వి.ఎస్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

ఆమదాలవలస : ఆన్లైన్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. చీమలవలస గ్రామంలో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌వి స్వచ్ఛంద సంస్థ కళాజాతాతో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పలానా బ్యాంకు నుండి మాట్లాడుతున్నామంటూ ఎవరైనా ఫోన్లు చేసి మన బ్యాంక్ అకౌంటు వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పిఎం జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను వివరించారు. డిజిటల్ పేమెంట్స్ వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ జి.లలితకుమారి, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో బోర్ల మరమ్మతులు

ఇచ్ఛాపురం: పట్టణంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలో బోర్లు మరమ్మతులకు గురి కావడంతో మున్సిపల్ కమిషనర్ రమేష్ శుక్రవారం వాటి మరమ్మతులు చేపట్టారు. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీ పాతాలేశ్వర ఆలయం దగ్గర బోరులో నుండి వస్తున్న నీరు ఆగిపోవడం కారణంగా జెసిబి ద్వారా తొలగిస్తున్న పనులను కమిషనర్ నల్లి రమేష్ పరిశీలించారు.. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ, ఇన్‌ఛార్జి ఎఇ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆలయానికి రూ.50వేలు విరాళం

ప్రజాశక్తి - మెళియాపుట్టి

పాతపట్నం మండలం బూరగాంలో జడ్డమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి టిడిపి సీనియరు నాయకులు మామిడి గోవిందరావు ఆలయ కమిటీకి రూ.50వేలు విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో భాగం కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ఎంజిఆర్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

పొందూరు ఖాదీపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పొందూరు

ప్రపంచప్రఖ్యాత గాంచిన పొందూరు సన్నఖాదీ వస్త్రాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా విద్యార్థులకు ఖాదీపై ప్రత్యేక ప్రాజెక్టు ఇచ్చారు. దీనిపై విద్యార్థులకు సంఘం అధ్యక్ష, కార్యదర్శి కామేశ్వరప్రసాద్, దండా వెంకటరమణ, శంకరరావు ఖాదీలో పలు ప్రక్రియలు వివరించారు. ఖాదీ ప్రత్యేకతలు, స్వాతంత్రోద్యమంలో ఖాదీ పాత్రను వివరించారు.

కిడ్నీ రోగికి పింఛను పంపిణీ


పింఛను అందిస్తున్న రాజ్యలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని రత్తకన్నలో కొండ పోలమ్మ కాలనీకి చెందిన కిడ్నీ రోగి పొందర రాముకి రూ.10వేలు పింఛన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అందించారు. ప్రభుత్వం కిడ్నీ రోగులకు అందిస్తున్న పెన్షన్ వల్ల కొంత మేలు కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ తాడి ఆదిరెడ్డి, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు పత్తి అన్వేష్, బూత్ కమిటీ మేనేజర్ ప్రకాష్‌రావు, పట్నాయక్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి శ్రీకాంత్ పరామర్శ

మెళియాపుట్టి: మండల కేంద్రంలో మృతి చెందిన రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కె.భాను ప్రకాష్ కుటుంబసభ్యులను తూర్పుకాపు కార్పొరేషణ్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శుక్రవారం పరామర్శించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ అండగా మీకు ఉంటుందన్నారు. అనంతరం వసుంధర గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి సలాన మోహన్‌రావు సోదరుడు ఎరుకునాయుడు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపిపి సవర ఆదినాయుడు, వినోద్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, రవీంద్ర జన్నా, సర్పంచ్‌లు జనపరెడ్డి కన్నబాబు, రవికుమార్, పెద్దింటి చంద్రరావు, ఎస్.గౌరేష్, ఆర్.వాసు, ఎస్.ధర్మారావు, ఎస్.అప్పారావు, ఎంపిటిసి ప్రతినిధులు ఉర్లన రుషి , జి.చిన్న, తదితరులు పాల్గొన్నారు.

గడ్డికుప్ప దగ్ధం


మంటలు ఆర్పుతున్న స్థానికులు

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ మండాపోలం కాలనీలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు ఎకరాలకు చెందిన గడ్డి కుప్పకు దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు టెక్కలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. సమీపంలో విద్యుత్ వైర్లు ఉండడంతో స్థానికులు ఆందోళన చెందారు.

ఉద్యోగుల సెలవులతో సేవలకు ఆటంకం

పొందూరు: తాడివలస సచివాలయంలో ఎక్కువమంది ఉద్యోగులు మూకుమ్మడిగా సెలవులు పెట్టడంతో సచివాలయం పరిధిలోని ప్రజలకు సేవలకు ఆటంకం కలుగుతోందని తాడివలస సర్పంచ్ తమ్మినేని మనెమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె ఓ ప్రకటనను విడుదల చేశారు. సచివాలయంలో పదిమంది ఉద్యోగులకు ప్రస్తుతం నలుగురే విధుల్లో ఉన్నారని, ఎక్కువ మంది దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారని చెప్పారు. ఎంపిడిఒకు, జిల్లా అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, గ్రామాల్లో ప్రజలకు నాణ్యమైన సేవల కోసం ప్రభుత్వం పెట్టిన సచివాలయం ఉద్యోగులు లేకపోతే ఎందుకని ప్రశ్నించారు.

జనసేనలో చేరిన శ్రీను

ఇచ్ఛాపురం: స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆధ్వర్యాన ప్రజారాజ్యంలో కీలకపాత్ర పోషించిన భవతి శ్రీనివాసరావు శుక్రవారం చేరారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి, పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జన సైనికులు పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళికను నవీకరించాలి

ప్రజాశక్తి - లావేరు

ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికను తమ రోజు వారీ నోటీసును నవీకరించుకోవాలని డిఇఒ గార పగడాలమ్మ అన్నారు. శుక్రవారం లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా 8వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు ప్రతి రోజూ ఒక పదం లెర్న్ వర్డ్ విద్యార్థులకు ఇవ్వాలని, సరైన రిజిస్టర్లులో రికార్డు చేయాలని, ప్రార్థన సమయంలో విద్యార్థులకు తెలియజెప్పాలని హెచ్‌ఎంను ఆదేశించారు. తర్వాత 10వ తరగతి విద్యార్థుల డైలీ ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహణను పరిశీలించారు మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఉపాధ్యాయులు సరైన పాఠ్య ప్రణాళికలను చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని ఆదేశించారు. డిఇఒ వెంట ఎంఇఒ లండ ఈశ్వరరావు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ జి.చంద్రశేఖరరావు, హెచ్‌ఎం పి.రాజారావు, తదితరులు ఉన్నారు.

డిఇఒ పగడాలమ్మ


విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ

అలరించిన 'ఎల్లా' సంగీత కచేరి

ప్రజాశక్తి - కవిటి


కచేరి నిర్వహిస్తున్న ఎల్లా వెంకటేశ్వరరావు

పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు సంగీత ఝరిలో శ్రోతలు తడిసి ముద్దయ్యారు. ఆయన మృదంగ విన్యాసం ఆహూతులను మునివేళ్లపై సరిగమలు పలికించింది. మండలంలోని చండిపుట్టుగ గ్రామంలో శుక్రవారం సాయంత్రం ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత వైలిన్ మృదంగ స్వరలయ కచేరిలో ఉప్పొంగిన సంగీత ఝరితో ఉద్దాన ప్రాంతం ఓలలాడింది. ఈ కచేరికి టిటిడి ఆస్థాన విద్వాన్, సంగీత కళానిధి, పద్మశ్రీ ఏ కన్యాకుమారి వయోలిన్, ఆలిండియా కళాకారుడు, కళై మామిణి వైకం గోపాలకృష్ణ, ఎయిర్ స్టాఫ్ డాక్టర్ నిశాంత్ చంద్ర వయోలిన్ తోడవడంతో కార్యక్రమం ఆద్యంతం నభూతో నభవిష్యత్ అనేలా సాగింది. కీర్తిశేషులు బొర్ర సత్యం సిద్ధాంతి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే బెందాళం అశోక్, వైసిపి సమన్వయకర్త సాయిరాజ్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, స్థానిక నాయకులు, నియోజకవర్గం నలుమూలల నుంచి సంగీతాభిమానులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



వైసిపి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర ప్రాంతం మరింత వెనుకబాటుకు గురైందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ వల్లే సాధ్యమవుతుందని సీనియర్ నాయకులు కొణతాల వెంకట శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన నగరంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతితో కలసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విభజన సమయంలో ఉత్తరాంధ్ర ప్రాంత వెనుకబాటు తనాన్ని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం జరిగిందన్నారు. విశాఖలో రేల్వేజోన్ ఏర్పాటు, పోర్టుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సాయపడేలా చట్టం చేసిందన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన మోడీ విభజన హామీలను అమలు చేయకుండా ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం చేశారన్నారు. అత్యధిక ఎంపీ సీట్లు గెలిపిస్తే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వ మెడలు వంచుతానని చెప్పి ఓట్లు వేయించుకున్న జగన్మోహన్‌రెడ్డి తన వ్యక్తిగత ప్రయోజనాలకు రాష్ట్రాన్ని మోడీ, షాలకు తాకట్టు పెట్టారని విమర్శించారు. దీని వల్ల జిల్లా నుంచి వలసలు పెరిగాయని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా మరో పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో నాయకులు గంప గోవిందరాజు, వి.శ్రీనివాసరావు, జి.శ్రీనివాస్, సయ్యద్ అబీద, పరదేశి, సనపల అన్నాజీరావు, లక్కినేని నారాయణరావు, కొత్తకోట సింహాద్రినాయుడు, కొత్తకోట లక్ష్మి, తెంబూరి మధుసూదనరావు, కొత్తకోట ఈశ్వరి, బొత్స రమణ, టి.శాంతారావు, పైడి నాగభూషణం, బసవ షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒటిలు, ఇతర అలవెన్సులు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


మాట్లాడుతున్న కృష్ణమూర్తి

ఆర్టీసీ కార్మికులకు ఓటిలు, ఇతర అలవెన్సులు చెల్లించాలని ఆర్టీసీ ఎంప్లా యిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు ఆవరణలో శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్ నుంచి విజయనగరం జోన్‌లో ఉన్న 19 డిపోల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఓటీలు, అలవెన్సు చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా రన్నారు. యాజమాన్యం పలుమార్లు విన్నవించినా స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లకు ప్రభుత్వ యాజమాన్యం అంగీకరించక పోతే విడతల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.త్రినాథ్, కార్యనిర్వాహక అధ్యక్షులు పి.నానాజీ, వన్ డిపో కార్యదర్శి ఎస్‌వి.రమణ, కెజి.రావు, జిఎన్.రావు, బి.జయదేవ్, జోగారావు,తదితరులు పాల్గొన్నారు.

అద్దె ఇంటిపై రాజకీయమా?

పలాస: పలాస నియోజకవర్గంలో రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు, ఆయన సోదరుడు త్రినాథ్ కొత్త సంస్కృతికి తెరలేపారని, అద్దె ఇంటిపై రాజకీయం చేసే పరిస్థితికి దిగజారడం దారుణమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు ధ్వజమెత్తారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పలాసలో నివాసం ఉండేందుకు ఏడాది క్రితం ఒక ఇంటిని అద్దెకు తీసుకొనేందుకు సిద్ధమైయారని, మూడు నెలలుకు సంబంధించి ఇంటి అద్దెను కూడా ముందుస్తుగా చెల్లిస్తే ఇంటిలో దిగే సమయానికి ఇంటి యజమాని అద్దెకు ఇవ్వడం కుదరదని చెప్పడం దారుణమన్నారు. ఎందుకు ఇవ్వటం లేదని అడిగితే మంత్రితో పాటు మంత్రి సోదరుడు ఇళ్లు అద్దెకు ఇవ్వొద్దుని బెందిరించారని చెప్పడం చూస్తుంటే పలాసలో ఏం జరుగుతుందో అర్థం కావడంలేదన్నారు.. వ్యాపారస్తులు తమ వ్యాపారాలు చేసుకోలేరని, రాజకీయ నాయకుల ఒత్తిడులకు తలొగ్గితే భవిష్యత్‌లో ఇబ్బందులకు ఎదుర్కొనే పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, సవర సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే

ప్రజాశక్తి - పోలాకి

ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా మండలంలో ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించేలా చూడాలని ఆర్‌డిఒ బి.శాంతి సూచించారు. శుక్రవారం మండలంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని పబ్లిక్, ప్రైవేటు స్థలాల్లో రాజకీయ పరమైన ఫ్లెక్సీలు ఉండకూడదని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లు పోలింగ్ కేంద్రాల వివరాలు పరిశీలించారు. మండలంలో భూరీసర్వే, సర్వే పూర్తయిన గ్రామంలో హద్దు రాళ్లు పాతించే కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీరాములు, డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, సర్వేయరు ఎం.శ్రీరామ్మూర్తి, ఆర్ఐ కె.కోటీశ్వరరావు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పొందూరు: పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న సవరమ్మ

పక్కాగా ఎమ్మెల్సీ ఎన్నికలు

కవిటి: ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ రాచర్ల అప్పలరాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణమూర్తి, సర్వేయర్ పాణిగ్రాహి, విఆర్ఒ నారాయణ పాల్గొన్నారు

ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలి


పోలాకి: మాట్లాడుతున్న ఆర్‌డిఒ శాంతి

పొందూరు: ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను శతశాతం పూర్తిచేయాలని ఆమదాలవలస ఇఆర్ఒ టి.సవరమ్మ పేర్కొన్నారు. మండలంలోని తాడివలసలో ఆధార్ అనుసంధానం ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తాడివలస సచివాలయం పరిధిలోని 132, 133 పోలింగ్ స్టేషన్లలో ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం తక్కువుగా ఉండడంతో అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. అనంతరం పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లు 62, 62ఎ, 63, 64ను పరిశీలించారు. ఆమెతో పాటు తహశీల్దార్ ఎస్.రాంబాబు, ఎన్నికల డీటీ మురళీధర్‌నాయక్, ఆర్ఐ రాధ, విఆర్ఒలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురికావద్దు

నందిగాం: సమాజంలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు, మహిళలు ఎటువంటి ప్రలోభాలకు లొంగవద్దని ఎస్‌పి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్ఫూర్తి బృంద నిర్వాహకులు అనూష పిలుపునిచ్చారు. మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదివి జీవితంలో స్థిరపడాలన్నారు. పోక్సో చట్టం, సోషల్ మీడియా వంటి ప్రభావాలకు లొంగకూడదని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో స్ఫూర్తి బృందం నిర్వాహకులు కుసుమకుమారి, ఈశ్వరి, రవి, సత్తిరాజు, మురళి, రాజు, గనేష్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు బాలక రామారావు, తులసి ప్రసాద్, రంకిడి రామారావు, బెందాళం రత్నం, ఇందిరాబాయి, ప్రియదర్శిని, యాగాటి త్రినాథరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నపిల్లమ్మ మృతికి సంతాపం

ప్రజాశక్తి - పలాస

మండలంలోని బొడ్డపాడు గ్రామానికి చెందిన జి.చిన్నపిల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి సిపిఎం నాయకులు బి.ఆనందరావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు బొడ్డు వాసుదేవరావు, టి.సన్యాసిరావు, యుటిఎఫ్ నాయకులు బి.ఓంకార్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. చిన పిల్లమ్మ శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ ఉద్యమ సమయంలో 1968లో రైతు సంఘం కార్య కలాపాల్లో పాల్గొన్నారని, అప్పటి ప్రభుత్వం పోలీసులు ఉద్యమంపై తీవ్ర నిర్బంధం కొనసాగించారని గుర్తు చేశారు. అందులో భాగంగానే సుమారు70 మందిని అరెస్ట్ చేసి, రాజమండ్రి సెంట్రల్ జైల్లో పెట్టారన్నారని చెప్పారు. వారిలో భర్తతో పాటు అమె ఉందని గుర్తు చేశారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆనంద్, ఓంకార్

నిందితులను అరెస్టు చేయాలి

బూర్జ: మండలంలోని ఎబిసి.పేటలో బుధవారం జరిగిన హత్య కేసులో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల జెఎసి నేతలు తైక్వాండో శ్రీను, ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కంట వేణు, బత్తిన మోహన్‌రావు డిమాండ్ చేశారు. దళిత యువకుడు జమ్మన సుదర్శనరావు హత్యకు గురైన విషయం తెలుసుకొన్న వారు శుక్రవారం పాలకొండ ఏరియా ఆస్పత్రికి వచ్చి, మృతదేహాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ సుదర్శనరావును అగ్రకులానికి చెందిన హోంగార్డు ఎ.రమణమూర్తి హత్య చేస్తే పోలీస్ అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై ఎస్ఐ అశోక్‌బాబు, సిఐ పైడయ్యను ప్రశ్నించారు. తక్షణమే ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఒక ఉద్యోగం, నష్టపరిహారం అందజేయాలన్నారు. లేకుంటే దళిత సంఘాల తరపున పోరాటానికి దిగుతామని స్పష్టం చేశారు అంతకుముందు మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారితో పాటు గురుబిల్లి రవికుమార్, నాని, పెయ్యల చంటి, వన్నల లక్ష్మీనారాయణ, జాషువా, తదితరులు పాల్గొన్నారు.


పోలీసులను ప్రశ్నిస్తున్న దళిత సంఘాల నాయకులు

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులతో కిషోర్‌కుమార్

రణస్థలం: యుటిఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఎంపిపి ఎస్‌జెఆర్.పురంలో శుక్రవారం జరిగాయి. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా డి.కోటేశ్వరరావు, అధ్యక్షులుగా కోదండ రామయ్య, ప్రధాన కార్యదిర్శగా టి.శంకరరావు, సహాధ్యక్షులుగా ఆర్.రాంప్రసాద్, ఐ.వెంకటేశ్వరి, కోశాధికారిగా డి.కుమారస్వామి, ఆడిట్ కమిటీ కన్వీనరుగా జె.రవి, సిపిఎస్ కన్వీనరుగా టి.కామేశ్వరరావు ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా టి.శంకరరావు, సహాధ్యక్షులు ఆర్.రాంప్రసాద్, ఐ.వెంకటేశ్వరి, కోశాధికారి డి.కుమారస్వామి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా జె.రవి, సిపిఎస్ కన్వీనర్‌గా టి.కామేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. కిషోర్‌కుమార్, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.నారాయణరావు పాల్గొన్నారు.


ట్రై సైకిల్ అందిస్తున్న ఎంపీ

కాళీమాతను దర్శించుకున్న ఎంపీ

కవిటి: మండలంలోని తొత్తిడిపుట్టుగ గ్రామంలో జరుగుతున్న కాళీమాత ఆలయ ప్రతిష్ఠలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ చొరవతో బిజి పుట్టుగ గ్రామానికి చెందిన బద్రి కాళికి బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్‌ను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మనిచంద్ర ప్రకాష్, బెందాళం రమేష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, లోళ్ల శ్రీను, ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, కొర్రాయి వాసు, పుల్లట సంతోష్, పుల్లట రాజు, తదితరులు పాల్గొన్నారు.

జెసిఐ ఎస్ఎంఎగా పోలుమహంతి

శ్రీకాకుళం అర్బన్ : పోలు మహంతి ఉమామహేశ్వరరావును ఎస్ఎంఎ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో జరిగిన సమావేశంలో ఎన్నిక జరిగింది. జెసిఐ జోన్ వైస్ ప్రెసిడెంట్ హరికుమార్ ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు జామి భీమశంకరరావు, సెనేటర్ నటుకుల మోహన్, ఎం.సత్యనారాయణ, శివప్రసాద్, మల్లిక్, అశోక్, చంద్రశేఖర్, భారతిరమేష్, పి. వెంకటరావు, నర్సునాయుడు, కె.ఎల్.ప్రసాద్, హబీబ్, పన్నాల నర్సింహమూర్తి, అంధవరపు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన సీనియర్ సభ్యులు

ప్రజల పైకి దూసుకెళ్లిన బొలెరో

● మహిళ మృతి ● మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - జలుమూరు


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

బొలెరో వాహనం అదుపుతప్పి ప్రజలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మహిళ మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని శ్రీముఖలింగం గ్రామానికి చెందిన పంచాది ఎర్రమ్మ(56), మరో 14 మంది ప్రభుత్వ పాఠశాల వైపు వ్యవసాయ పనుల కోసం వెళ్తున్నారు. చల్లవానిపేట వైపు నుంచి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి మహిళలపైకి దూసుకెళ్లింది. మిగతా వారంతా తప్పించుకోగా, ఎర్రమ్మను బొలెరో బలంగా ఢీకొంది. ఆమె తలకు, వెనుక వైపు బలమైన గాయం కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందింది. అక్కడితో వాహనం ఆగకుండా ఎదురుగా సైకిల్‌పై వస్తున్న అల్లు ప్రసాద్‌ను ఢీకొంది. దీంతో ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే బుడితి పిహెచ్‌సికి ఆయనను చికిత్స నిమిత్తం తరలించారు. వాహనం ఆగకుండా వెళ్లి శ్రీముఖలింగం గ్రామ శివారును బోల్తా పడింది. డ్రైవరు, క్లీనర్‌గాకు ఎటువంటి గాయాలు కాలేదు. వారు అక్కడి నుండి పారిపోయేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. డ్రైవర్, క్లీనర్ ఇద్దరు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. మృతురాలికి కుమారుడు శేఖర్, కుమార్తె రోజా ఉన్నారు. కుమారుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు.



మంచులో కనిపించక..


మన్మథరావు మృతదేహం

బూర్జ: మండలంలోని పెద్దపేట గ్రామం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కడగల మన్మథరావు(42) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మన్మథరావు గ్రామ సమీపంలో బహిర్భూమికి వెళ్తున్నాడు. శ్రీకాకుళం నుంచి స్కూటీపై పార్వతీపురం పెళ్లికి వెళ్తున్న ఇద్దరు ఫొటోగ్రాఫర్లు పొగ మంచు కారణంగా రోడ్డు కనిపించక మన్మథరావును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మన్మథరావు గాయపడగా, ద్విచక్ర వాహనదారులు కూడా గాయపడ్డారు. 108లో వీరిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించేలోపే మన్మథరావు మృతి చెందాడు. ఎస్ఐ అశోక్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మన్మథరావుకు భార్య ఇంధుమతి, దీక్షిత, లహరి ఉన్నారు. మృతుని సోదరులు ఇద్దరూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం గ్రామస్తులను కలవరపర్చింది. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊపిరాడక..

టెక్కలి రూరల్: మండలంలోని రావివలసకు చెందిన నార్ల పశు పుణ్యవతి(48) గురువారం మృతి చెందింది. ఆమె గ్రామస్తులు, కుటుంబసభ్యులతోకలిసి తిరుపతి వెళ్లింది. 1వ తేదీన తిరుపతి నుంచి రైలు ఎక్కి వస్తోంది. శ్రీకాకుళం వచ్చేసరికి తీవ్ర అస్వస్థతకు గురైంది. గ్రామస్తులు ఆమెను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఆమె మృతితో రావివలసలో విషాదఛాయలు అలముకున్నాయి.